

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# ఈ నాటి సంత గోల

*ఏల సలిలంబు పారు? గాడ్పేల వీచు? కరెంటేల పోవు? ఫలానా పాడు పీనుగ ఏల పాడు? ఇంకో ఫలానా ఆవిడ ఏల రాయు? అష్ట దరిద్రపు తెలుగు కన్వెన్షన్లు యేల జరుగు?*

వీటన్నింటికీ నిక్కచ్చయిన సమాధానాలు దొరకొచ్చుగానీ, *"ఏల శీనిగాడు సంతకి పోవు?"* అనేదానికి మాత్రం జెవాబు దొరకదు. అహలు జవాబు లేనేలేదు మరి. ఆఫీసుకి ఎలావెడతామో, సంతకీ అంతే. అదో స్ట్రెస్సు రిలీవరన్నమాట. ఉద్యోగం పురుషలక్షణవని చెప్పుకు తిరుగుతున్నారు గానీ, అసలు *"సంత"* చేయడం పురుష లక్షణం. సింహంలా సంతలో ప్రవేశించి, కావలసినవన్నీ కరచి పుచ్చుకుని, గుహలోకొచ్చి, పిల్లిలా అన్నీ ఫ్రిజ్జులో పెట్టేస్తే, ఏ ఆడదైనా చెయ్యక ఛస్తుందా వంట, అదీ లాజిక్కు. ఈ సూక్ష్మం తెలియక, ఆడాళ్ళని సంతకి పంపిస్తారు మగపీనుగులు, పని తప్పుతుంది కదాఅని. వాళ్ళేమో, నాలుగు కాకర కాయలు, మూడు గోంగూర ఆకులు, రెండే పచ్చిమెరపకాయలు, ఒక్కటంటే ఒఖ్ఖటే బంగాళ దుంప తెచ్చేసి, ఏకవీరలా ఏకంగా వారవంతా మేనేజి చేసేద్దామనే డేమేజింగ్ ఆలోచనతో సంత చేస్తారు, వీళ్ళ ప్లాను సంతకెళ్ళా. ఇంక వారవంతా ఏకభుక్తవే. అందుకే ఎన్ని అవమానాలు భరించైనా సరే మగాడే వెళ్ళాలి సంతకి. తిండి దెగ్గిర కూడా బధ్ధకవైతే ఎలాగ?

నా సంగతే తీసుకోండి. నన్ను అచ్చంగా ఆరంటే ఆరు సరుకులు తీసుకు రమ్మని,లిస్టు రాసి, మరీ పంపిస్తుంది మా శాల్తీ. నేను దారిలో ఓ వంద పేజీల రూళ్ళ పుస్తకం కొనుక్కుని, ఈ లిస్టు దాంట్లో ఫెయిర్ చేసి, నా చేర్పులన్నీ చేసి, అక్షరాలా అరవైనాలుగు సరుకులు తీసుకొస్తాను. అదేవిటో, కొట్టుమీద కెళ్ళాకా, అన్నీ అత్యవసరమైన సరుకుల్లాగే కనిపిస్తాయి మరి. పుష్ప విలాపంలో, తోటలో ప్రతి పువ్వు *"నన్ను కొయ్యద్దూ, నన్ను కొయ్యద్దూ"* అందిట.

నన్ను చూసి షాపులో ప్రతి సరుకూ *"నన్ను కొనూ, నన్ను కొనూ"* అంటే, నేనేం చెయ్యానూ? ఆ మధ్యన ఓ పెద్ద సీసాడు రోజు వాటర్ కొన్నాను. ఫేస్‌బుక్‌లో ఎవడో తలమాసిన వాడు చెప్పాడు, రోజ్ వాటర్‌లో రోజుకో కిస్‌మిస్ నానబెట్టి తింటే బీ.పీ తగ్గిపోతుందని. నాకు లేదు, అయినా తగ్గించేద్దావని కొనేసాను, ఇంతకీ, కిస్‌మిస్‌లు మర్చిపోయాను. ఇంటికొచ్చాకా అష్టోత్తరం పూర్తయింది. సరే ఎల్లాగూ, తెచ్చాం కదా, అని ఓ రెండ్రోజులు పోయాకా కిస్‌మిస్‌లు తెచ్చాను. తీరా అలమారా తెరిచి చూస్తే రోజ్ వాటర్ లేదు. మా ఆవిడ రోజ్ వాటర్‌ని, గులాబీ మొక్క మొదట్లో పారపోసేసి, ఆ సీసాలో జీడిపప్పులు వేసేసింది. జీడిపప్పులో కిస్‌మిస్‌లు నానవు కాబట్టి, నా ప్రయత్నం విరమించుకున్నాను. దీనిలో అహాలు మన తప్పేవైనా వుందా? మీరే న్యాయం చెప్పండి?

ఇల్లాంటి చిన్న చిన్న చికాకులకి జడిసిపోకూడదు. అయినా మగ పుట్టక పుట్టాకా సంత చెయ్యకపోవడం ఎంత నామర్దా ! మన మాట చెల్లే ఒకే ఒక్క ప్రదేశం కూరగాయల షాపు. మనకి ఆ పూట ఇంట్లో శాల్తీతో చెడిందనుకోండి, సరదాగా, ముదిరిపోయిన దొండఫలాలు, ఎండిపోయిన పొట్లకాయలూ పట్టుకొచ్చేయచ్చు. మనం లంచ్ ఏ సౌత్ ఇండియన్ కజిన్ గాడి దెగ్గరో కుమ్మేసి, రాత్రి డైటింగ్ అని ఫోజు కొట్టేయచ్చు. ఒహ వేళ ఇంట్లో ఆవిడ మనని సరిగ్గా చూసుకుంటూంటే, మనం కూడా ఏరి కోరి కూరలు ఏరి ఏరి పట్రావచ్చు. తనివితీరా కారు ట్రంకు నింపేసి, ఆనక ఫ్రిజ్జు నింపేసి, వారవయ్యాకా, ఆవిడకి తెలీకుండా, కుళ్ళిన వన్నీ బయట పారెయ్యచ్చు.. ఎంత స్వేఛ్ఛ. అసలు ***సంత కర్ నా మేరా జన్మ సిద్ధ అధికార్ హై,*** అన్నమాట, అజ్జిబాబోయ్, ఏటిది, హిందీ వచ్చేస్తోంది.. సరే అలాక్కానీ.

ఇంతకీ మా కూరల షాపు కెళ్దావని బయల్దేరాను ఏవీ తోచక. వాడు పదిన్నరకి తెరుస్తానన్నాడని బైటే వెయిట్ చేసాను. నాలాంటి పనిలేని స్వేఛ్ఛావాదులు అప్పుడే పార్కింగ్ లాట్లో కాలు కాలిన పిల్లుల్లా తిరుగుతున్నారు అప్పటికే. షాపు వాడు పదకొండింటికి తలుపు తెరిచి, లోపలికి ఏడవమన్నట్టు సైగ చేసాడు. మెల్లిగా షాపింగ్ కార్టు తోసుకుంటూ లోపలికెళ్ళా. అందరూ ఏదో కొంపలంటుకుపోతున్నట్టు హడావిడిగా సంత చేసేస్తున్నారు. నాముందో బట్టతల శాల్తీ. పొట్టి వంకాయని తీసి, దీర్ఘంగా పరిశీలిస్తున్నాడు. కాసేపు అన్ని వైపులూ తిప్పి చూసాడు. నేను ఎందుకేనా మంచిదని ఆయన్ని డిస్టబ్బు చెయ్యలేదు.

ఆయనే అడిగాడు ***"సార్, ఇది ఏం కూర"?*** అని.

నేను నిర్ఘాంతపోయి, పోయి, మళ్ళీ బతికి చెప్పాను ***"దాన్ని వంకాయ అంటారు సార్."*** అని.

మరి ఇక్కడ ***"ఎగ్ ప్లాంట్" అనున్నది? ఇది వెజిటేరియన్నేనా?"*** అని అడిగాడు.

అది ***"అమాయకత్వవో"*** లేక రెండోదో అర్థంకాలేదు నాకు.

***"సార్, నన్ను నమ్మండి, ఎగ్గులు ప్లాంట్స్ కి కాయవు సార్, ఇది సత్యప్రమాణకంగా వంకాయేనండి."*** అన్నాను దీనంగా.

ఆయన భయం భయంగా ఓ రెండు తీసి కార్ట్‌లో వేసాడు. నేను ఓ పాతిక తీసి నా సంచిలో వేసేసాను. ఆయన నన్ను బెదురు చూపులతో చూసాడు. ఇంతలో అతని ఫోను మోగింది. ఎత్తాడు. అటునించి వినబడుతోంది

***" ఏంది ఇంతసేపు, ఏం కొన్నావు?"***

***"అది.., వంకాయ అంట, రెండు తీసుకున్నా?"' '***

***'రెండెందుకు, పిల్ల పెళ్ళి చేస్తున్నావా? ఒక్కటి చాలు, తియ్, రెండోది తీసి ఆడ పెట్టు"..***

అతను వణికిపోతూ రెండో వంకాయ పెట్టేసాడు. *వాళ్ళ అమ్మాయి పెళ్ళికి మాత్రం, పిలిచినా సరే వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాను నేను.* నేను ఇటు తిరిగే సరికి నా కార్టు కనబడలేదు. ఎవరో పిల్లాడు దాన్ని కందిపప్పులూ గట్రా వుండే సందులోకి తోసేసాడు. దాన్ని వెతికి పట్టుకునే సరికి అరగంట పట్టింది. అప్పటికే ఆడాళ్ళు డాళ్ళు, కత్తులు పట్టుకుని సంత కొచ్చేసారు. ఇలా వచ్చి, అలా కొనేసి, యుద్ధం గెలిచేసి, వెళిపోతున్నారు.  కొందరు చేతి పర్సులలోనూ, కొందరు గుప్పిట్లోనూ వారానికి సరిపడా సరుకులన్నీ కొని పట్టుకుపోతున్నారు. వాళ్ళలో ఒక అరుంధతి ఇంటికో కాలిచ్చుకుంది..

***" ఏవండీ, మీ మొహం మండా, ఆ  కుక్కరు ఎన్ని కూతలొచ్చిందీ.."?***

***"అది కాదే నువ్వేమో కుక్కరు చిన్న బర్నరు మీద పెట్టి, పెద్ద బర్నరు వెలిగించావు, అందుకనీ, కూతలేవీ రావట్లేదే.."***

***" అయ్య మీ మొహం మండా, అలా చూస్తూ నించో పోతే, ఆ  కుక్కరు మార్చండీ, లేకపోతే అసలు కూతలే రావు."***

***"సరేనే, మరినే స్నానం చెయ్యనా..",***

***"మీ జలకాలకి ఇప్పుడేవీ తొందరలేదు, ముందు పప్పు ఉడకనివ్వండి..వెధవ గోల, వెధవ గోలాని..పెట్టండి ఫోను.."*** అనేసి పెట్టేసింది.

ఇల్లాంటి బభ్రాజమానం గాడికి అసలు పప్పు ఎందుకు, ఉత్త చారు అన్నం పెట్టాలి నెల రోజులు, తెగులణుగుతుంది, వీడి బతుకు చెడ...

సరేలే, మనకెందుకొచ్చిన గొడవ, మన సంగతి మనవేడుద్దావు, అని ఎప్పటిలాగే కసిమీద కార్టు నింపేస్తున్నాను. బట్టతల శాస్త్రీ మళ్ళీ వచ్చాడు.

ఆయన నన్నో గాడ్ ఫాదర్ లా చూస్తున్నాడు. ***"సార్, బీన్స్ అంటే..ఎట్లా వుంటాయ్ సార్."*** .

తట్టుకోలేకపోయాను. అయినా తమాయించుకుని, ***"పచ్చగా, సన్నగా, పొడుగ్గా ఉంటాయండీ"*** అన్నాను వచ్చే కన్నీళ్ళు ఆపుకుంటూ.

ఆయన థాంక్స్ చెప్పేసి, సరిగ్గా పదిహేను బీన్స్ ఏరి సంచీలో వేసి, లిస్ట్‌లో టిక్కు పెట్టుకున్నాడు. నాకు ఒక్క మాటు *ఆయన మొగుణ్ణి* చూడాలనిపించింది. అడిగితే బావుండదని ఊరుకున్నాను.

ఒక బుట్టలో కొన్ని పేకెట్లున్నాయి. వాటిల్లో ఒకవైపు కుళ్ళిపోయిన టమోటాలు రెండు, ముచిక దగ్గిర కమిలిపోయిన అరటికాయ ఒకటి, సగంలో సగం చెక్కేసిన కాలీఫ్లవరూ కలిపి పాకెట్లు కట్టేసి, డాలర్‌కి ఓ పాకెట్టమ్మేస్తున్నాడు. నలుగురు మొగాళ్ళూ ఆరుగురు ఆడాళ్ళూ అక్కడ యుద్ధం మొదలెట్టారు. నాకు ఎందుకో ***"భజగోవిందం"*** గుర్తొచ్చింది. ***"సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి కుళ్ళు రాంబళక్కాయ్."*** అనుకుంటూ అక్కడినించి పారిపోయా. ఇంక నా కార్టు ఛస్తే కదలనని మొరాయించింది. అప్పుడు నేను వ్యాహ్యాళి విరమించి కౌంటర్ దగ్గిరి కెళ్ళి క్రెడిట్ కార్డిచ్చాను. ఆవిడ ఇబ్బందిగా చెప్పింది ***" మీకు ఈ కార్డుపై అంత ఖర్చుపెట్టే శక్తి లేదు."*** అని. వెంటనే కార్డు వాడికి ఫోను చేసి, క్రెడిట్ లైను పెంచుకుని, కూరముక్కలు కొనేసాను. ఆవిడ ఫ్రీగా ఇచ్చిన దొంగ డీ.వీ.డీ ని అతి భద్రంగా ముందు సీటులో పెట్టి, కారు సెకండ్ గేర్ లో వేసి ఇంటికొచ్చేసా.

ఇంటికొచ్చేసరికి మా ఆవిడ రెడీగా ఉంది. ముందుగా బిల్లు జాగ్రత్త పెట్టింది.

తరవాత, ***"హమ్మయ్య, అన్నీ తెచ్చేసారుకదా, వెరీ గుడ్, మీరు పైకెళ్ళి స్నానం చేసి , పూజ కానిచ్చి రండి, భోజనం చేద్దాం"*** అని నన్ను పైకి పంపేసింది.

***భార్యా "సంత వతీ" మిత్రః."*** అనుకుని, ఆనంద బాష్పాలు రాలుస్తూ, పైకెళిపోయా (మేడ మీదకి).

వెంటనే ఆవిడ షాపు కి ఫోను చేసి..***"హలో, ఆ  నేనేనండి, ఈసారి క్రితం సారికన్నా మేలండి, మొత్తం ఇరవై నాలుగు ఐటెంసు రిటర్న్ చెయ్యాలండి, మనకి అలవాటే కదా, సాయంత్రం వస్తాను, సరే, సరే..ఉంటాను ఆంటీ."*** అనేసి ఫోను పెట్టేసింది.

మా ఆవిడ పాతివ్రత్యానికీ, ఆవిడ ఆంటీ తాలూకు ఔదార్యానికీ కరిగిపోయిన నా మనస్సు,  షవర్ లో తడిసి ముద్దయిపోయింది.

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS